# ఓ విశ్వాసులారా!

## అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సఅసం)ను విశ్వసించిన వారలారా! నా విన్నపాన్ని కాస్త శ్రద్ధగా ఆలకించండి!!

ఆ మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) -

★ ఎవరిపైనయితే దేవుడు తన కరుణానుగ్రహాలను కురిపించాడో .

★ ఎవరికొరకైతే దైవదూతలు కారుణ్య వేడుకోలు చేస్తారో .

★ ఎవరి వయస్సు గురించి దేవుడు తన పవిత్ర గ్రంథంలో ప్రమాణం చేశాడో .

★ ఎవరి జీవితాన్నయితే దేవుడు అత్యుత్తమ ఆదర్శంగా ఖరారు చేశాడో

★ ఎవరినయితే విశ్వసించే వాగ్దానం 'ఆత్మావస్థ'లో దైవప్రవక్తలందరిచే తీసుకోబడిందో.

★ ఎవరికయితే అల్లాహ్ మేరాజ్ (గగన యాత్ర) భాగ్యాన్ని అనుగ్రహించాడో.

★ ఎవరి తదనంతరమైతే మరో ప్రవక్త ప్రళయ దినం వరకూరాడో.

★ ఆయన (సఅసం) ప్రసన్నుడైతే దేవుడు కూడా ప్రసన్నుడవుతాడు.

★ ఆయన (సఅసం) అప్రసన్నత దేవుని అప్రసన్నతకు మూలం.

★ ఆయన (సఅసం) విధేయతే దేవుని విధేయత.

★ ఆయన (సఅసం) అవిధేయతే దేవుని అవిధేయత.

★ ఆయన (సఅసం) నిర్ణయాల్లో ఏ ఒక్క దానిపై విముఖత చూపినా అది సమస్త సత్కార్యాలను నాశనం చేసి వేస్తుంది.

★ ఆయనను (సఅసం) మించిపోయేందుకు ఎవరికీ అనుమతి లేదు.

★ ఆయన (సఅసం) సమక్షంలో హెచ్చు స్వరంతో మాట్లాడటం కూడా తమ ఇహపరాలను నాశనం చేసుకోవటమే.

★ ఆయన (సఅసం) విధేయతలో స్వర్గముంది, అవిధేయతలో నరకముంది.

teluguislam.net



**మనమంతా :-**

ఆ మహనీయ ముహమ్మద్ (సఅసం) అనుయాయులం. మనమంతా ఆ మహనీయుడు (స) నేర్పిన సద్వచనాన్నే (కలిమానే) పఠించాము. మన సంబంధం ఆ అగ్రజుని (స) తోనే ఉంది. మరలాంటప్పుడు మనం వేర్వేరు కుంపట్లు పెట్టుకోవటం, వేర్వేరు తెగలుగా విడిపోవటం, వేర్వేరు ధార్మిక సముదాయాలుగా చీలిపోవటం, ఆయా పేర్లు చెప్పుకుని గర్వపడటం, ఇదంతా ఏమిటి?

దైవం మరియు దైవప్రవక్త (స) పై విశ్వాసముందని చెప్పుకునే సోదరులారా! దైవప్రవక్త (స) సంప్రదాయం "ఇది" అని స్పష్టంగా తెలిసిపోయిన మీదట కూడా మనం మనసు మెచ్చే పంథాల (మస్లక్‌ల)ను, పద్ధతులను పట్టుకు వ్రేలాడటం న్యాయమా?

దైవాన్ని, దైవప్రవక్త (స) ను విశ్వసించే ప్రజలారా! కాస్త నా మాటను వినండి:

" నా విధానం పట్ల వైముఖ్య ధోరణిని ప్రదర్శించిన వానితో నాకెట్టి సంబంధం లేదు" (బుఖారీ, ముస్లిం) అని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చినట్లు ఆయన ప్రత్యక్ష సహచరుడు హజ్రత్ అనస్(రజి) తెలియజేశారు.

ఓ విశ్వసించిన వారలారా! మనం మహాప్రవక్త (సఅసం) వారి ఉపదేశాన్ని విన్నాము కదా! మరి దీనికి మనం ఇచ్చే సమాధానం ఏమిటి? కాస్త ఆలోచించండి!